## చిన్నకథ

# తప్పులెన్నువారు...

**''ఏవోయ్ విశ్వనాథం, మనవరాలి బర్త్‌డే ఏర్పాట్లు చాలా గ్రాండ్‌గా ఏర్పాటు చేసినట్లున్నావు. వంటింట్లోని ఘుమఘుమలు ఇక్కడికి కూడా వస్తున్నాయి'' విశ్వనాథం ఇంట్లోకి అడుగుపెడ్తూనే సరదాగా కామెంట్ చేశాడతని మిత్రుడు రామచంద్రం.**

''ఘుమఘుమల సంగతి కాసేపు మరిచిపో. ఆ సోఫాలో కూర్చుని డీవీడీలో వచ్చే మంచి సినిమాను చూడు ముందు'' టీవీ స్క్రీన్‌పై నుంచి తల తిప్పకుండానే తన మిత్రుడిని ఆదేశించాడు విశ్వనాథం.

రామచంద్రం సోఫాలో కూర్చుని 'డీవీడీలో వచ్చే సినిమా ఏమిటో?' అని ఆసక్తిగా చూశాడు. పాతకాలపు సినిమా 'పాండవ వనవాసం' వస్తూ ఉంది డీవీడీలో. కుర్చీల్లో సోఫాలలో కూర్చుని ఉన్న విశ్వనాథం మనవలు, మనవరాళ్లు ఆ సినిమానే చూస్తూ ఉన్నారు. బహుశా వాళ్లంతా విశ్వనాథం మనవరాలు శ్వేత బర్త్‌డే ఫంక్షన్‌కు వచ్చి ఉంటారనుకున్నాడు రామచంద్రం. వారి మొఖాల్లో కొట్టొచ్చినట్లున్న విసుగుదల గమనించి అడిగాడు.



''విశ్వం, నీకీ పాతకాలం పౌరణికాలంటే పిచ్చ ఇష్టమని తెలుసు నాకు. నీ టీనేజీ మనవలకి, ప్రైమరీస్కూలు మనవరాళ్లకీ బలవంతంగా ఇదే సినిమా చూపిస్తావా? వాళ్ల కిష్టమైన సినిమా వాళ్లను చూడనివ్వరాదా?''

'వాళ్ల మొఖం. వాళ్లకేం తెలుసు? నాకేది ఇష్టమైతే వాళ్లూ అది చూడాల్సిందే'' హుకుం జారీ చేసినట్లు చెప్పాడు విశ్వనాథం. రామచంద్రం అవాక్కయ్యాడు.

ఇంతలో పట్టు పరికిణీలో వున్న విశ్వనాథం మనవరాలు శ్వేత ఓ ప్లేట్లో 'మైసూర్‌పాకు, చేగోడీలు' తీసుకువచ్చి ఇచ్చింది రామచంద్రానికి. వాటిని నములుతూ మళ్లీ తన సందేహం బయట పెట్టాడు రామచంద్రం.

''ఔ నౌరే విశ్వనాథం, మొన్నామధ్య ఓ పెళ్లిలో మనం భోంచేస్తున్నప్పుడు, నీ పక్కనే నీ మనవరాలు శ్వేత కూర్చుంది కదా! అప్పుడా అమ్మాయికి 'జిలేబి, ఉల్లిపాయల పకోడి' ఇష్టమని నువ్వే చెప్పావు. ఇప్పుడవే పదార్థాలు ఆ అమ్మాయి పుట్టిన రోజుకు చేయించి వుంటే బాగుండేది కదా.''

''మైసుర్‌పాకు నా చెల్లెలు లక్ష్మికి ఇష్టం. చేగోడీలు నా కూతురు మాధురికి ఇష్టం. కాబట్టి నా మనవరాలు కూడా అవే ఇష్టపడాలి'' దర్పంగా అన్నాడు విశ్వనాథం.

''కానీ ఇక్కడ బర్త్‌డే నీ చెల్లెలుదో, కూతురుదో కాదు. నీ మనవరాలిదిగా, ఈ రోజు ఆ అమ్మాయి ఇష్టా ఇష్టాలను గౌరవించాలి. నీకు నీ కూతురు, చెల్లెలి మాటలు వేదవాక్కులే కావచ్చు..'' రామచంద్రం మాటలకు గట్టిగా నవ్వేశాడు విశ్వనాథం. రామచంద్రం అర్థం కానట్లుగా చూశాడు.

''మొన్నామధ్య చిత్తూరు నుంచి తిరుపతికి బస్సులో వస్తున్నప్పుడు మీ రెండోవాడు రాజేంద్ర నా పక్క సీట్లో కూర్చున్నాడు. మాటల సందర్భంలో చెప్పాడు. వాడికి వచ్చిన సంబంధాలన్నింటినీ నీ కూతురుకి నచ్చలేదనీ, నీ చెల్లెలు ఒప్పుకోలేదనీ తిరగ్గొడ్తున్నావట. లేకుంటే జాతకాలు కలవలేదనో, దూరాభారమనో ఏవో చిన్నసాకులతో వెనక్కు పంపుతున్నావట. రాజేంద్ర అభిప్రాయానికి వీసమెత్తు విలువియ్యడం లేదట. అతని అభిరుచులు వేరు, మీవి వేరని నీకు తోచలేదూ.

పెళ్లి రాజేంద్రది. ఆ అమ్మాయితో జీవితాంతం కాపురం చెయ్యాల్సింది అతను. అతని మాట వినకుండా, నీ చెల్లెలు, కూతురు మాటలకు లొంగి ఇలా ప్రవర్తించే నీకు బుద్ధి చెప్పాలనే ఇలా అరేంజ్ చేశాను'' అన్నాడు.

రామచంద్రం నాలిక్కొరుక్కుని తప్పు తెలుసుకున్నట్లుగా చూశాడు. సరికొత్త సినిమా డీవీడీ ప్లేయర్‌లోకి మారుస్తున్నాడు విశ్వనాథం మనవడు.

– రాచపూటి రమేష్